క్లుప్తంగా

నేడు మండల సమావేశం

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు బుధవారం తెలిపారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వరహాలబాబు


వరహాలబాబు

జగ్గంపేట: బీజేపీ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడిగా జగ్గంపేటకు చెందిన వత్సవాయి వరహాలబాబు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్ నుంచి నియామక ఉత్తర్వులు అందినట్టు బుధవారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత


ఏలేశ్వరంలో బాధితులకు సాయం అందజేస్తున్న వివేకానంద సేవాసమితి సభ్యులు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు ప్రాజెక్టు సమీపంలోని దిబ్బల్లో అగ్ని ప్రమాద బాధితులకు వివేకానంద సేవాసమితి సభ్యులు చేయూతనందించారు. వివేకానందా సేవాసమితి ఆధ్వర్యంలో బాధితులకు బుధవారం దుస్తులు, బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. బాధితులను ఆదుకొనేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు, సభ్యులు మద్దెల రమణ, గట్టిం వెంకటరమణ, రెడ్డి రాజు, పలివెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోటీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు

ప్రత్తిపాడు రూరల్: వచ్చే ఎన్నికల్లో పోటీపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. మండలంలోని ధర్మవరంలో బుధవారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల బరిలో నిలవాలంటే రూ.కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నికల్లో పోటీపై త్వరలో నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో ముద్రగడ తనయుడు గిరిబాబు, గణేషుల మురళి, నాగార్జున, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

పంటలను త్వరగా ఒబ్బిడి చేసుకోవాలి

గండేపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి పంటలను త్వరగా ఒబ్బిడి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎ.సద్గురుమూర్తి సూచించారు. రైతులు తొందరగా తమ పనులు ముగించాలన్నారు. ఇప్పటికే కోత కోసి పనలపై ఉన్న పంటను కుప్పలుగా వేయాలన్నారు. డిసెంబర్ 3వ తేదీ నాటికి కోతలు పూర్తి చేసుకుని ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి చేర్చుకోవాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

గోకవరం: మండలంలోని వెదురుపాకలో భక్తాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కొరిపల్లి అప్పలస్వామి, సత్యవేణి దంపతులు ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. తొలుత పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామస్తులతో పాటు, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు సహకరించాలని కోరారు.

కార్తిక వనసమారాధన

ఏలేశ్వరం: పట్టణంలో బుధవారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. స్థానిక సాయిబాబామెట్ట వద్ద ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సుమారు 400 మందికి అన్నదానం చేశారు. తొలుత ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు.

గోకవరం: స్థానిక శ్రీవాసవీ ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. గ్రామ శివారులోని మామిడి తోటలో ఉసిరి చెట్టుకు సామూహిక పూజలు నిర్వహించారు. సంఘం సభ్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

జగ్గంపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఏడాది రైతులకు వ్యవసాయ పనుల్లో సహకారం అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై బుధవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు.


శంఖవరంలో సంక్షేమ పథకాల వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


ఏలేశ్వరంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


తునిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు


ధర్మవరంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- పలు గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్


నీలాద్రిరావుపేటలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు హామీ ఇచ్చారు. మండలంలోని నీలాద్రిరావుపేటలో బుధవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..(వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు లబ్ధిదారులకు గతంలో కేటాయించిన స్థలాలు గ్రామానికి దూరంగా ఉండటంతో స్థానికుల కోరిక మేరకు అనుకూలమైన చోట ఇంటి స్థలాలు కేటాయిస్తామన్నారు. ఎవరూ ఆందోళన చేందాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. తొలుత గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయంలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుంచె రాజా, గ్రామ సర్పంచ్ ములంపాక సురేష్, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, జెడ్ రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు, జేసీఎస్ గ్రామ కన్వీనర్లు కాకి శ్రీను, నక్క అబ్బులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

తుని: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. పట్టణంలోని 14, 15 వార్డులకు సంబంధించి రాజా రాజబాబు మున్సిపల్ పార్కు వద్ద ఉన్న సచివాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. తొలుత వైఎస్సార్ సీపీ జెండాను మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ఎగురవేశారు. గత నాలుగున్నరేళ్లలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి పనుల వివరాలతో కూడిన ఫ్లెక్సీని చైర్‌పర్సన్, పార్టీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, జేసీఎస్ కన్వీనర్ నామర్తి మహేష్, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్ కనిగిరి వెంకటరమణ, జిల్లా టెలికాం కమిటీ సభ్యుడు మద్దా కరుణాసాగర్, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

శంఖవరం: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. స్థానిక సచివాలయం-2 వద్ద బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనుల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును సచివాలయంలో ఏర్పాటు చేశారు. గ్రామ ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను ఆవిష్కరించారు. అనంతరం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, వజ్రకూటం సర్పంచ్ సకురు గుర్రాజు, పంచాయతీ కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు జగన్‌తోనే సాధ్యం

ఏలేశ్వరం: రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక 6వ సచివాలయం పరిధిలోని 2, 12 వార్డుల్లో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత సంక్షేమ పథకాల వివరాలను తెలిపే బోర్డును ఆవిష్కరించి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు అలమండ చలమయ్య, సామంతుల సూర్యకుమార్, బదిరెడ్డి గోవిందు, దోశి కిషోర్, పైల విజయ్‌కుమార్, తొండారపు రాంబాబు, వాగుబలరామ్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పెద్దనాపల్లిలో పార్టీ మండలాధ్యక్షుడు అడపా పార్థసారథి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు.

తొండంగి: పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మండలంలోని దానవాయిపేటలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండాను వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలిగిన లబ్ధిని వివరించారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, పార్టీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, పార్టీ నాయకులు అంగుళూరి సుశీలరాణి, దడాల విజయ్, మడదా హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: పేదల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రత్తిపాడు ఏఎంసీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ అన్నారు. మండలంలోని రాఘవపట్నంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సచివాలయం వద్ద డిజిటల్ బోర్డును ఏర్పాటు చేసి, ప్రధాన రహదారిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు.


దానవాయిపేటలో పార్టీ జెండాను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, మండల జేసీఎస్ అధ్యక్షుడు రామకుర్తి బాబ్జి, పార్టీ నాయకుడు చెన్నాడ భీమరాజు, ఎంపీటీసీ సభ్యురాలు నూకరత్నం, యాదాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేయడమే లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్చార్జి రామి శెట్టి చినబాబు అన్నారు. మండలంలోని ధర్మవరంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును, గ్రామంలోని ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్ ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గడప గడపకూ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల, ఎంపీటీసీ సభ్యురాలు జువ్వల సుజాత, సొసైటీ చైర్మన్లు చెక్కపల్లి సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు రాపా గుర్రాజు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

కోటనందూరు: పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సాగుదారులకు డీ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ పేదలకు మంచి చేయాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. దీనిలో భాగంగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు సర్వహక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేస్తున్నారన్నారు. మండలంలో 561 మంది లబ్ధిదారులకు డీ పట్టాలు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ కుశరాజు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, ఏఎబీ చైర్మన్ లంక ప్రసాద్, కోప్షన్ మెంబర్ కోట సత్తిబాబు, సర్పంచులు జిగటాల వీరబాబు, సుర్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమిల్లి గోవిందు, కుంచే అచ్చిరాజు, రుత్తల జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.


కోటనందూరులో రైతులకు డీ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు


తునిలో పేదల భూములకు డీ పట్టాలు పంపిణీ చేస్తున్న ఏలూరి బాలు తదితరులు

పేదల భూములకు పట్టాల పంపిణీ

తుని: నిరుపేదలకు భూమి ఉండాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు ఏలూరి బాలు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం 48 మంది లబ్ధిదారులకు డీ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సాగుదారులందరికీ సర్వహక్కులు కల్పిస్తూ పట్టాలు ఇస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజాను వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, తహసీల్దార్ శివకుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు


కోటనందూరు గొడౌన్‌లో టెక్స్ట్‌బుక్స్‌ను తనిఖీ చేస్తున్న డిపో మేనేజర్ సురేష్

కోటనందూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించిన పాఠ్యపుస్తకాలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెక్స్ట్ బుక్స్ గొడౌన్ మేనేజర్ పి.సురేష్ తనిఖీ చేశారు. మండలంలోని అల్లిపూడి కేజీబీవీ, అంబేడ్కర్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి అందరికీ అన్ని సబ్జెక్టులకు సంబంధించి టెక్స్ట్ బుక్స్ అందాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. పిల్లల దగ్గర ఉన్న పుస్తకాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కోటనందూరు హైస్కూల్లోని గొడౌన్‌ను తనిఖీ చేసి ఎన్ని పుస్తకాలు వచ్చాయి? ఎన్ని పుస్తకాలు పాఠశాలలకు సరఫరా చేశారు ? అని ఆరా తీశారు. మిగిలిన పుస్తకాల వివరాలు నమోదు చేసుకున్నారు. అచ్చు పుస్తకాల పంపిణీపై ఎంఈఓలు ఏవీఎస్ శ్రీనివాస్, మామిడి రామశేఖర్‌లతో చర్చించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎన్ వేణుగోపాల్, సీఆర్‌పీ శేఖర్, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏటిగట్టు వద్ద వ్యర్థాల తొలగింపు


మామిడాడలో ఏటిగట్టున చెత్తను జేసీబీతో తొలగిస్తున్న అధికారులు

జగ్గంపేట: మామిడాడలో సంచలనం కలిగించిన చెత్తకుప్పలో పేలుడు సంఘటన అనంతరం మండల అధికారులు అప్రమత్తమయ్యారు. మామిడాడ ఏటిగట్టున ఉన్న చెత్త నుంచి పేలుడు సంభవించి ఐదుగురు పిల్లలకు గాయాలైన విషయం తెలిసిందే. కాగా బుధవారం జగ్గంపేట ఈఓపీఆర్డీ కొండలరావు మామిడాడలో పర్యటించారు. గ్రామంలో ఏటిగట్టున ఉన్న చెత్త, వ్యర్థాలను జేసీబీతో తొలగించారు. ఈ ప్రాంతంలో ఎక్కడా చెత్త లేకుండా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులు వ్యర్థాలను ఏటిగట్టున వేస్తున్నారన్నారు. ఇక్కడ చెత్త వేయవద్దని ఇప్పటికే తమ సిబ్బంది ప్రజలకు సూచించారన్నారు. ఇక్కడ వేసే చెత్తను పంచాయతీ సిబ్బంది కాల్చడం లాంటి చర్యలు ఎప్పుడు జరగలేదన్నారు. కాగా సోమవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు ఎవరో చెత్తకు నిప్పు పెట్టారని తెలిపారు.

బాల కార్మికులపై ప్రత్యేక నిఘా


ప్రత్తిపాడులో ఇటుకల బట్టీని తనిఖీ చేస్తున్న జిల్లా లేబర్ ఆఫీసర్ పద్మావతి

ప్రత్తిపాడు: బాల కార్మికులపై ప్రత్యేక నిఘా ఉంచినట్టు జిల్లా లేబర్ ఆఫీసర్ వి. పద్మావతి తెలిపారు. ఇళ్లలో, ఫ్యాక్టరీల్లో, దుకాణాల్లో బాల కార్మికులతో పనులు చేయిస్తే దండన తప్పదని హెచ్చరించారు. పాన్ ఇండియా చైల్డ్ లేబర్ లైన్ తనిఖీల్లో భాగంగా బుధవారం ప్రత్తిపాడు, ధర్మవరం గ్రామాల్లోని పలు దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు బాలబాలికలతో పనులు చేయించరాదన్నారు. గ్రామంలోని అన్ని రకాల దుకాణాలను తనిఖీ చేశారు. జాతీయ రహదారిపై గల ఇటుక బట్టీని తనిఖీ చేసి, బాల కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె వెంట మండల విద్యాశాఖాధికారులు వి. రాజబాబు, వై.అచ్చిరాజు, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, కోర్టు ప్యానెల్ అడ్వకేట్ ఎస్.దేవీ, సీఆర్‌ఎంటీ రాంజీ ప్రసాద్, ఏఎస్సై ఆదినారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు

కిర్లంపూడి: కాకినాడ జేఎన్‌టీయూకేలో ఇటీవల జరిగిన సాంస్కృతిక పోటీల్లో తృతీయ స్థానం సాధించిన విద్యార్థులను బుధవారం పలువురు నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు. తామరాడ జెడ్పీ ప్రభుత్వోన్నత పాఠశాలలో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ తోట అయ్యన్న ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. వారికి తర్ఫీదు ఇచ్చిన బావిశెట్టి లక్ష్మీనారాయణను వైఎస్సార్ సీపీ నాయకులు శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎన్ కృష్ణ, కాయల సూరిబాబు, కాయల శివరామకృష్ణ, పెదిరెడ్డి లక్ష్మణ్, అడబాల శ్రీను, బాలిన నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

1,600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పరారైన ఏడుగురు నిందితులపై కేసులు నమోదు చేసినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. పెదశంకర్లపూడి అటవీ ప్రాంతంలో సారా స్థావరాలపై దాడి చేసి సారా తయారీకి సిద్ధం చేసిన 1000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సంఘటన స్థలం నుంచి పది లీటర్ల సారాను, సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో పెద శంకర్లపూడికి చెందిన గొంప సుబ్బారావు, గుత్తుర్తి సురేష్, కోట శ్రీను, గీసాల లోవరాజు, బత్తిన సన్యాసిరావు, కోట శ్రీను, కృష్ణంరాజుపై పరారీ కేసులు నమోదు చేశారు. కె.మిర్తివాడ గిరిజన తండాలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ కేసులో పరారైన బురదకోట గిరిజన తండాకు చెందిన పూజల లోవమ్మపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో కాకినాడ సెబ్ సీఐ పి.సునీల్ కుమార్, సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, జిల్లా టాస్క్‌ఫోర్స్ సెబ్ ఎస్సై జె.విజయ్‌కుమార్, జిల్లా ఇంటిలిజెన్స్ సెబ్ ఇన్‌స్పెక్టర్ కె.గిరిధర్, ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్, ప్రత్తిపాడు సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.


భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

తుని: సామాన్య ప్రజలను సమస్యల్లోకి నెట్టేసే భూహక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం బార్ అసోసియేషన్ న్యాయవాదులు పట్టణంలో నిరసన ర్యాలీ చేశారు. భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ చట్టం ద్వారా అనేక భూ సమస్యలు వస్తాయన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ రవికుమార్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

గోకవరం: క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా క్రీడల లోగోను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో 15 నుంచి 35 సంవత్సరాల లోపు వారు పాల్గొనవచ్చాన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో క్రీడా పోటీలకు సంబంధించి కమిటీలు ఏర్పాటు చేస్తారన్నారు. సచివాలయ స్థాయిలో డిసెంబర్ 15 నుంచి 20, మండల స్థాయిలో డిసెంబర్ 21 నుంచి జనవరి 4 వరకు పోటీలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుకుమార్, మెహర్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు


గోకవరంలో ఆడుదాం ఆంధ్రా పోటీల లోగోను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తుని: రోటరీ క్లబ్ యువజనోత్సవాల్లో భాగంగా స్థానిక రాజా కళాశాల మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు అందరినీ అలరించాయి. బుధవారం జరిగిన ఫైనల్స్‌లో సీనియర్స్ విభాగంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాల, జూనియర్స్ విభాగంలో రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల జట్లు విజేతలుగా నిలిచాయని రోటరీక్లబ్ కార్యదర్శి కిశోర్‌రెడ్డి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. రోటరీక్లబ్ తుని శాఖ అధ్యక్షుడు వర్మ, పోగ్రాం కమిటీ చైర్మన్ ప్రసాద్, నాగిరెడ్డి, కె.గణేష్, మంగరాజు, సత్యసాయి, వీర్రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ రుణాలపై అవగాహన


సహకార బ్యాంకులో జీరో అకౌంట్ ఖాతా కోసం పత్రాలు అందజేస్తున్న రైతులు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో బుధవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కో ఆపరేటివ్ బ్యాంకు గోకవరం బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సహకార బ్యాంకు ద్వారా మూడు రకాల రుణాలు ఇస్తారన్నారు. కేసీసీ ద్వారా రుణాలు తీసుకుని సంవత్సరం లోపు తిరిగి చెల్లిస్తే వడ్డీ రాయితీ వస్తుందన్నారు. దీర్ఘకాలిక రుణాల్లో రైతు నేస్తం కింద ఎకరానికి రూ.8 లక్షల రుణం ఇస్తారన్నారు. అలాగే డ్వాక్రా రుణాలు, గోల్డ్ రుణాలు కూడా ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతిఒక్కరూ సహకార బ్యాంకులో జీరో అకౌంట్ ప్రారంభించి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పలువురు రైతులకు అకౌంట్లు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, విశాల సహకార పరపతి సంఘం డైరెక్టర్ తొట్టా సత్యానారాయణ, స్థానిక నాయకులు డి.వెంకటరత్నం, శివ, కో ఆపరేటివ్ బ్యాంక్ సిబ్బంది కె.ప్రదీప్‌చంద్ర, బి.శ్వేత, శ్రీనివాస్, అప్పన్నదొర, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

గండేపల్లి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నేత తోట నరసింహం అన్నారు. మండలంలోని మురారిలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర కాకతీయ కల్యాణ మండపం ప్రారంభోత్సవానికి బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత కల్యాణ మండపంలో గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్, లక్ష్మీదుర్గ దంపతులతో పండితులు గణపతి హోమం జరిపించారు. మధ్యాహ్నం కార్తిక వనసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచె రాజ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ గఫూర్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మూర్తి పాల్గొన్నారు.

వచ్చే నెల 17న పెన్షనర్ల దినోత్సవం

ప్రత్తిపాడు: గ్రామంలో వచ్చే నెల 17న పెన్షనర్ల దినోత్సవం నిర్వహించాలని మండల పెన్షనర్ల సంఘం తీర్మానించింది. స్థానిక ఉప ఖజానా కార్యాలయ ఆవరణలో బుధవారం మండల పెన్షనర్ల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు, విశ్రాంత ఎంఈఓ ముక్కు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పెన్షనర్ల దినోత్సవం రోజున 80 ఏళ్ల దాటిన విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తామన్నారు. పెన్షనర్లు ప్రతి సంవత్సరం సమర్పించే లైఫ్ సర్టిఫికెట్లు 2024 జనవరి, ఫిబ్రవరి నెలల్లో సమర్పించాలని ఆయన కోరారు. పీఆర్సీ, డీఆర్ బకాయిలు చెల్లించమని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.